క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీఓ వెంకటేశు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, కో–ఆప్షన్ మెంబర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

కంటి ఆపరేషన్‌కు 115 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్.వి అరవింద్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కంటి పరీక్షలకు 198 మంది హాజరుకాగా 115 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఆపరేషన్ చేయించడంతో పాటు ఉచితంగా వసతులు కల్పిస్తున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్ చంద్, విశాల్ జైన్, సాగర్‌జైన్, ప్రవీణ్ జైన్, లలిత్ జైన్ పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి విహారం

సదుం: మండలంలోని బూరగమందలో భూదేవి శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనం ఉత్సవమూర్తులు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో తొలుత ఉదయం అభిషేకాలు, విశేషాలంకారం, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మేళతాళాలతో ఘనంగా అశ్వ వాహన సేవ నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం ద్రౌపది సమేత ధర్మరాజస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవవారిని మంగళవాయిద్యాలతో గ్రామస్తులు అమ్మవారికి కొత్త దుస్తులు, పట్టువస్త్రాలు, పూజసామగ్రితో అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో వైభవంగా జరిపారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పెద్ద సంఖ్యతో పాల్గొన్నారు. మధ్యాహ్నం పూర్ణ భాగవతారిణి హరికథా గానం భక్తులను అలరించింది.

ద్రౌపదీ ధర్మరాజుల రథోత్సవం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో నిర్వహిస్తున్న మహా భారత మహోత్సవాలలో భాగంగా ఆదివారం ద్రౌపదీ ధర్మరాజుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద రథాన్ని పచ్చతోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రథంపై ద్రౌపదీదేవిని కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయానికి పర్లాంగు దూరంలోని గుడిసత్రం వద్ద అర్జునుడు, ఉత్తర కుమారుని వేషధారులు రథంపైకి చేరుకున్నారు. గుడిసత్రం వద్ద పరిసర గ్రామస్తులు పశువులను తీసుకునవచ్చారు. ఆ పశువులకు జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఆవులతో 'ఉత్తర గోగ్రహణం' కార్యక్రమాన్ని అర్జున వేషధారి నిర్వహించారు. ఆలయం వద్ద పశువులను పరుగులు తీయించారు. రథోత్సవం, ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలకు తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. సోమవారం ఆలయం ఆవరణలో ఇలావంతుని బలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

పలమనేరు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కుప్పం పీఈఎస్ వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 1968లో ఇక్కడ ఎస్ఎస్ఎల్‌సీ చదివిన అప్పటి విద్యార్థులు సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. దాదాపు 150మందిని వైద్యులు పరీక్షించారు. వీరిలో తొమ్మిది మందిని కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ నిర్వాహకులు రఘు, వీరభద్ర తెలిపారు. శిబిరంలో పీఈఎస్‌కు చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్య సేవలు

- అందుబాటులోకి అధునాతన యంత్ర పరికరాలు
- శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు


గుడిపాల పీహెచ్‌సీలో అధునాతన పరికరాలు


ల్యాబ్ పరీక్షలు చేస్తున్న గది

గుడిపాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్రీ ఎన్‌లైజర్, యూరిన్ ఎన్‌లైజర్, టీబీఆర్టీ పీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చారు. ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి వాటి సంఖ్య 65కు పెరిగింది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించారు. చిత్తూరులో 22 రోజుల పాటు ల్యాబ్ టెక్నీషియన్లు శిక్షణ పొందారు.

ఎంతో మేలు

గతంలో పీహెచ్‌సీ అంటే నామమాత్రంగా ఉండేది. చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆస్పత్రి, లేదా జిల్లా కేంద్రంలోని ఆస్పకి వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థికభారంగా ఉండేది. అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటివరకు రోగికి సరైన వైద్యం అందేది కాదు. పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని కొందరు పేద రోగులు సైతం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీల్లోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి చెప్పారు.

అందుబాటులోని వైద్య పరీక్షలు

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, లోటస్‌బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్‌బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్ఐవీ, హైపటైటిస్–బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్‌టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 65 రకాల పరీక్షలు చేయనున్నారు.

త్వరగా రోగ నిర్ధారణ


ఇకపై పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు పేద రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. వెంటనే అవసరమైన వైద్యాన్ని అందిస్తాం. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలోనే అన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. –సంధ్య, పీహెచ్‌సీ డాక్టర్, గుడిపాల

అందుబాటులో పరికరాలు


రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా శిక్షణ కూడా ఇచ్చారు. పీహెచ్‌సీల్లో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి సేవలు అందిస్తున్నాం. –వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్, గుడిపాల

బహు సుందరమే


వికసించిన మే పుష్పాలు

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఓ ఇంటి పెరటిలో ఆదివారం మే పుష్పాలు వికసించాయి. స్థానిక రాజావీధిలో నివాసముంటున్న నీలవేణి ఇంటి ఆవరణలోని పెరటితోటలో మే పుష్పాలు పూశాయి. ఏడాదికి ఒకసారి మే నెలలో మాత్రమే ఈ పుష్పాలు పూయడం విశేషం. స్థానికులు పుష్పాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



విశేషాలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి, బొమ్మాయిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో శనివారం రాత్రి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో వార్షికోత్సవ పూజలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చివరి రోజు స్వామి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణమహోత్సం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రేవ్ పార్టీ బురదను వైఎస్సార్‌సీపీపై చల్లడం అమానుషం


ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి

తవణంపల్లె: రేవ్ పార్టీలో వైఎస్సార్‌సీపీపై బురదచల్లడం అమానుషమని ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీని వైఎస్సార్‌సీపీకి అంటకడుతూ బురదచల్లడం సమంజసం కాదని ఖండించారు. సీఎంతో, మంత్రులతో ఫొటో దిగినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకి అంటకట్టడం పచ్చపత్రికలకు అలవాటుగా మారిందని విమర్శించారు. వాస్తవానికి తవణంపల్లె మండలం మడవనేరికి చెందిన అరుణకుమార్ కుటుంబం దశాబ్దాలుగా టీడీపీ కోసం పని చేస్తోందన్నారు. అరుణకుమార్ తండ్రి మోహన్‌నాయుడు ఆ గ్రామంలో టీడీపీ నాయకుడని చెప్పారు. ఏ రోజైనా వైఎస్సార్‌సీపీకి పని చేసి ఉంటే నిరూపించవచ్చని పచ్చమీడియాకు, టీడీపీకి సవాల్ విసిరారు.

మరోసారి జగన్‌కే పట్టం


హేమంత్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రిగా మరో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కట్టినట్లు ఓటింగ్ సరళి చూస్తే తెలుస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు హేమంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ విశాఖ వేదికగా జూన్ 9న మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయబోయే ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి గెలవబోతోందంటూ చోటా మోటా నాయకులకు ఆశలు కల్పించి వారితో అప్పులు చేయించి మరీ పందేలు కట్టిస్తున్నారని విమర్శించారు.

కృష్ణారెడ్డి సేవలు మరువలేనివి


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రతాప్‌రెడ్డి, ఆర్‌జేడీ రాఘవరెడ్డి

పూతలపట్టు: మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తించిన కృష్ణారెడ్డి సేవలు మరువలేనివని రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాలాజీ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎంఈఓ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, చదువు అందరికీ అందాలని తపించి పాఠశాలలను పవిత్రంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసిన కృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేశారన్నారు. అనంతరం కృష్ణారెడ్డిని పూలమాల, దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ రాఘవరెడ్డి, ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. కూత ఘనం

– ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో భవిత

గుడుపల్లె: పిట్ట కొంచెం..కూత ఘనం– అనే సామెత ఇదిగో ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పాల బుగ్గల చిన్నారికి అతికినట్లు సరిపోయింది. వయసేమో ఏడాదిన్నరే. కానీ జ్ఞాపకశక్తిలో అసమాన్య ప్రతిభ ఈ చిన్నారి సొంతం. ఫలితంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. వివరాలు..మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న లక్ష్మీ వరప్రసాద్, అశ్రిత దంపతుల కుమార్తె భవితకు ఏడాదిన్నర వయసు. తమ కుమార్తెకు జ్ఞాపకశక్తి, గ్రాహ్యక శక్తి బాగా ఉన్నట్టు గుర్తించిన తల్లిదండ్రులు కొన్ని విషయాల్లో రాటుదేలేలా నేర్పించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 2024 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలలో భవిత పాల్గొంది. భారత దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులు ఎ నుంచి జెడ్ వరకు అక్షరాలు కూడిన పదాలు, రైమ్స్ సంఖ్యలు, జాతీయ చిహ్నాలు, వారం రోజుల పేర్లు అతి తక్కువ సమయంలో చెప్పడంతో రికార్డును కైవసం చేసుకుంది. ఈ చిన్నారి దీంతో పాటు 40 దేశాల రాజధానుల పేర్లను కూడా చెప్పింది. ఆదివారం రికార్డు సర్టిఫికెట్ వారి ఇంటికి చేరింది.

వృత్తే దైవం

కొయ్య(దారు)కి జీవం పోస్తూ తమ శిల్పకళా చాతుర్యంతో జీవనోపాధి పొందుతున్నారు తొరూరు గ్రామస్తులు. గ్రామంలోని పలు కుటుంబాలకు చెందిన కళాకారులు చిన్న ఉలి, చెక్కసుత్తితో గణపతి, శ్రీవేంకటేశ్వరస్వామి, దశావతారాలు, అష్టలక్ష్మలు, సకల దేవతా మూర్తులు, గృహోపకరణాల కళాకృతులు ఒకదానికి మరొకటి జీవం పోసుకోవడం అందరినీ అబ్బురపరుస్తోంది. ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కళా వస్తువులకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు మంచి గిరాకీ ఉంది. ప్రభుత్వాలు సైతం తొరూరు కళాకారుల ప్రతిభను గుర్తించి మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కళలకు ప్రతిరూపాలు తొరూరు కళాకారులు
- బొమ్మల తయారీయే వారికి జీవనాధారం
- కొయ్యతో అద్భుత కళాఖండాలు తీర్చిదిద్దుతున్న కళాకారులు
- రాష్ట్రస్థాయిలో తొరూరుకు గుర్తింపు


శ్రీవేంకటేశ్వరస్వామి బొమ్మ


ఆకట్టుకుంటున్న హంసల బొమ్మ


తొరూరు కళాకారులు తయారు చేసిన గణపతి బొమ్మ


తోరణాలు

పుత్తూరు: చెక్క శిల్పాల గనిగా తొరూరు గ్రామం రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది. పుత్తూరు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో తొరూరు గ్రామం ఉంది. గ్రామంలోని వారంతా వ్యవసాయం, కూలి పనుల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే సుమారు 40 కుటుంబాల వారు మాత్రం బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తుండడం విశేషం. ఆరు దశాబ్దాల కిందట ఇదే గ్రామానికి చెందిన ఎం.రామలింగం అనే వ్యక్తి కొయ్య బొమ్మలు చెక్కడంపై చూపించిన చొరవ తొరూరు గ్రామానికే కీర్తిని తెచ్చిపెట్టింది. తనతో పాటు మరి కొందరికి బొమ్మలు చెక్కడంపై తర్ఫీదు ఇచ్చాడు. దీంతో పలు కుటుంబాలకు బొమ్మల తయారీ జీవనాధారమైంది. తొలుత చిన్న చిన్న బొమ్మలను మాత్రమే తయారు చేసేవారు. వీటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా ఉండేది. దీంతో రామలింగం మద్రాసుకు వెళ్లి వాటిని అమ్ముకుని వచ్చేవాడు. క్రమేపీ వాటిని హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకొచ్చేవారు. క్రమేపీ కళాకృతులను హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, ముంబై వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండడంతో వ్యాపారాలు ఆశాజనకంగా ఉన్నట్లు కళాకారులు చెబుతున్నారు.

ఒకదానికి మించి మరొకటి..

అమ్మకాలు ఆశాజనకంగా ఉండడంతో ప్రస్తుతం ఆరడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ సత్యభామ, గణపతి వంటి బొమ్మలతో పాటు గృహోపకరణాలకు సంబంధించి ఏనుగు తల, గుర్రం, దశావతారాలు, తోరణాలు వంటి పలు బొమ్మలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని నెల నెలా నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి చేయూతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎగ్జిబిషన్స్‌లో పెట్టే స్టాల్స్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది.


దశావతారాల బొమ్మ

చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం


గత ఏడేళ్లుగా బొమ్మల తయారీ పనిచేస్తున్నా. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఈ బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అందరం బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాం. బొమ్మ తయారీలో నైపుణ్యం, శ్రద్ధతో పాటు సహనం అవసరం. చిన్న పొరబాటు జరిగినా చెక్క మొత్తం పడేయాల్సిందే. మా కూలి ప్రస్తుత ధరలకు సరిపోవడం లేదు. ప్రభుత్వం మాలాంటి కళాకారులకు పెన్షన్ అందించి ఆదుకోవాలి. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే అద్భుత కళాకండాలు సృష్టిస్తాం. యువత సైతం చేతి వృత్తుల పట్ల ఆసక్తి చూపుతుంది.
– ముని, దారుశిల్పి కళాకారుడు, తొరూరు, పుత్తూరు మండలం

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం


మా మామ రామలింగం అందించిన బొమ్మల తయారీని వృత్తిగా కొనసాగించిన నాభర్త పార్థసారథి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబంతో పాటు మాపై ఆధారపడిన పలు కుటుంబాల జీవనోపాధి అందించాలన్న ఉద్దేశంతో ఇదే వృతిని కొనసాగిస్తున్నా. ప్రస్తుతం 20 మందికి పని కల్పిస్తున్నా. ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఆర్థిక సాయం చేస్తే మేలైన కళాకండాలను అందిస్తాం. ప్రస్తుతం కొయ్యల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఎగ్జిబిషన్స్‌లో అమ్మకాలు జరపాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం.
–ఎం.చంద్రకళ, దారుశిల్పి, తొరూరు, పుత్తూరు మండలం